


మంచు కౌగిలి

కాణిపాకంలో బుధవారం పొగ మంచు కమ్ముకుంది. ఎదుటి మనిషి కనిపించని రీతిలో మంచు కురిసింది. - 8లో



బోయకొండలో విధ్వంసం

బోయకొండ గంగమ్మ ఆలయంలో తీర్థం పంపిణీ చేసే కాంట్రాక్టర్ మద్యం మత్తులో విధ్వంసం సృష్టించాడు. - 8లో



ప్రాణం తీసిన సరదా

కుశస్థలి నదిలో ఓ విద్యార్థి గల్లంతై, మృతి చెందాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. - 8లో

న్యూస్‌రీల్

ఎస్సీ కులగణన అభ్యంతరాలుంటే తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ కులగణనపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీ వరకు ఎస్సీ కులగణన సోషల్ ఆడిట్ నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఎస్సీ కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. తుది వివరాలను ఈ నెల 17వ తేదీన ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కులగణనపై మూడు దశల్లో తనిఖీలుంటాయన్నారు. పేరు, ఆధార్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి ఆర్ఐకి పంపుతారన్నారు. ఆర్ఐ పునఃపరిశీలించి, తుది ఆమోదం తెలిపి వివరాలు భద్రపరుస్తారన్నారు. ఈ వివరాల్లో కచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో సరాసరి 50 మంది వివరాలను తనిఖీ చేయిస్తామన్నారు. సోషల్ ఆడిట్‌ను తనతో పాటు ఆర్డీఓలు స్వయంగా పర్యవేక్షిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో భక్తుల సందడి



క్యూలో వేచి ఉన్న భక్తులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, గంటల తరబడి వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని ఎన్‌సీసీ విద్యార్థులు క్రమబద్ధీకరించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడిపారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్నికి వెళ్లే ప్రధాన రహదారి అర కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది.

షీ బాక్స్ పోర్టల్ ఏర్పాటు చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో షీ బాక్స్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు డీఈఓలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన జారీ చేసిన ఉత్తర్వులు బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. పని స్థలంలో లైంగిక వేధింపుల నివారణ, ఫిర్యాదుల కోసం షీ బాక్స్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,495 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 19,298 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.80 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది.

కూటమి కొత్త కొర్రీ

మేము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ఫైలు పైనే తొలి సంతకం అని హామీ.. అధికారంలోకి వచ్చారు. ఎట్టకేలకు ఆ ఫైలుపై తొలి సంతకం చేశారు.. గత ప్రభుత్వ నోటిఫికేషన్ రద్దు.. ఆపై టెట్ అన్నారు.. అదీ వాయిదా అన్నారు.. మళ్లీ గతంలో డీఎస్సీ కేసులపై అధ్యయనం సాకు.. ఆపై ఎస్సీ వర్గీకరణ నివేదిక వస్తేనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ కూటమి కొత్త కొర్రీ పెడుతోంది.





పలమనేరు: డీఎస్సీ నిర్వహించకుండా కూటమి సర్కార్ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఇప్పుడు జరుగుతున్న తంతు చూస్తుంటే వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి సైతం కొత్త ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరుగుతుందన్న విషయం అనుమానంగా మారింది. పలువురు అభ్యర్థులు తాము చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలు వదులుకుని రూ.వేలకు వేలు ఫీజులు కట్టి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొంది, డీఎస్సీ కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికే మూడు దఫాలు డీఎస్సీ వాయిదా వేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎస్సీ వర్గీకరణపై క్లారిటీ వచ్చాకే డీఎస్సీ ఉంటుందనే కొత్త మెలిక పెట్టింది.

ఉన్న కొలువులు వదులుకుని..

డీఎస్సీ వస్తుందన్న ఆశతో పలువురు తాము చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలు వదులకుని, రూ.వేలకు వేలు కోచింగ్ సెంటర్లకు ఫీజులు కట్టి, శిక్షణ పొంది, ఖాళీగా ఉన్నారు. చాలామంది అభ్యర్థులు గతంలో ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలో పనిచేస్తుండేవారు. మెగా డీఎస్సీలో పోస్టు కొట్టాలన్న ఆశతో ఉన్న ఉద్యోగాలను వదులుకున్నారు. డీఎస్సీ రాక, ఉన్న ఉద్యోగం లేక రోడ్డున పడి ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కోచింగ్ సెంటర్లే కాకుండా రాష్ట్రంలోని పలు చోట్ల మెగా డీఎస్సీ కోసం కోచింగ్ సెంటర్లలో ఉన్న వారి సంఖ్య ఐదు వేల మంది వరకు ఉన్నట్టు అంచనా.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలు



మెగా డీఎస్సీ అని చెప్పి రకరకాల కారణాలతో డీఎస్సీ వాయిదా వేయడం తగదు. ఇప్పటికే ప్రభుత్వ బడుల్లో టీచర్ల కొరత కారణంగా నిర్వహణ భారమైంది. దీనికితోడు విద్యావ్యవస్థలో మార్పులు చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇవన్నీ జరిగేదెప్పటికో? డీఎస్సీ పెట్టెదెపుడో? అనే అనుమానాలున్నాయి. ఏదేమైనా ఈ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది.

–సోమచంద్రారెడ్డి, యూటీఎఫ్ మాజీ నాయకుడు, పలమనేరు

వాయిదాల డీఎస్సీ



గత ప్రభుత్వ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. మెగా డీఎస్సీ అన్నారు. ఆపై టెట్ రాయాలన్నారు. మళ్లీ ఎస్సీ వర్గీరణపై కమిటీ నివేదిక రావాలంట. ఇదంతా చూస్తే ఇది వాయిదాల డీఎస్సీనేనా? అనిపిస్తోంది. మా పిల్లలను డీఎస్సీ కోచింగ్ కోసం నంద్యాలకు పంపాం. ఎన్నాళ్లని వాళ్లు కోచింగ్ సెంటర్‌లో ఉందేది. వాళ్లకు ఎంత ఖర్చు. ముఖ్యంగా వాళ్లు మానసిక వేదనకు గురి అవుతున్నారు.

–పుష్పరాజ్, ఎస్సీ టీచర్ల సంఘ మాజీ నాయకులు, పలమనేరు

గత ప్రభుత్వ నోటిఫికేషన్‌ను అమలు చేసుంటే..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే కూటమి నేతలు ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ అంటూ ఊదరగొట్టారు. ఆపై అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి డీఎస్సీపై మాట మార్చి దాటవేస్తున్నారు. మెగా డీఎస్సీ పేరిట 16,347 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి, ఆరు నెలలు పూర్తయినా ఇప్పటికీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. అయితే గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను అమలు చేసుంటే ఇప్పటికే కొత్త ఉపాధ్యాయులు అందుబాటులోకి వచ్చేవారు.

కుంటిసాకులతో మెగా వాయిదా

తొలుతేమో టెట్ మరోసారి నిర్వహించి ఆపై డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పింది. ఆపై గతంలో డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి, అడ్డంకులు తొలగించి, నోటిఫికేషన్ ఇస్తామని వాయిదా వేశారు. ఇప్పుడేమో ఎస్సీ వర్గీకరణ కమిటీ సూచనల కోసం ఎదురుచూస్తున్నామని కమిటీ నివేదిక అందాకే డీఎస్సీ ఉంటుందని మెలిక పెట్టారు. ఎస్సీ కమిషన్ నివేదిక వచ్చేదెపుడో? ఆపై ప్రభుత్వం డీఎస్సీని నిర్వహించేదెపుడో? ఇదంతా సాధ్యమైయ్యేపనేనా? అని ఉపాధ్యాయ సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని నిర్వహించి ఎస్సీ కమిషన్ సూచనలు వచ్చాక ఎస్సీ అభ్యర్థులను నియమిస్తామని మిగిలిన పోస్టులనైనా భర్తీ చేసుంటే బాగుండేదని పలువురు విద్యావేత్తలు చెబుతున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కుప్పంరూరల్: సీఎం చంద్రబాబు 5,6,7 తేదీల్లో కుప్పం పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం, సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభించనున్న నడుమూరు, చీగలపల్లిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం హెలిప్యాడ్ ప్రదేశాలను సందర్శించి, స్థానిక అధికారులకు ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎక్కడా లోపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శ్రీనివాసరాజు, కడా డైరెక్టర్ వికాస్ మర్మత్, స్థానిక అధికారులు ఉన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నీకి పలమనేరు విద్యార్థిని



ప్రవీణ

పలమనేరు: చెన్నైలో ఈ నెల 7న జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పట్టణంలోని ఎంవీఆర్ కళాశాలకు చెందిన ప్రవీణ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుధా, కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. పోటీల్లో వాలీబాల్ జట్టులో ఎస్వీ యూనివర్సిటీ జట్టు తరఫున పాల్గొంటుందని చెప్పారు. ఈ కళాశాలలో బీకాం సెకండ్ ఇయర్ చదువుతున్న ప్రవీణ వాలీబాల్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఈపోటీలకు ఎంపికైంది. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనున్న ఎస్వీయూ జట్టులో పలమనేరు నుంచి ప్రవీణ ఎంపికై ఉదన్నారు. కళాశాల యాజమాన్యం ఆమెకు అభినందనలు తెలిపింది.

ఏం..తాగేశార్రా బాబూ!

కొత్త మద్యం పాలసీ.. 24 గంటలూ అందుబాటులో మద్యం.. ఆపై ఆంగ్ల నూతన సంవత్సరాది.. ఇంకేముంది.. మద్యం ప్రియులు మనసారా తాగేశారు.. ఊగిపోయారు. ఎంతగా అంటే మూడు రోజుల్లో ఏకంగా రూ.పది కోట్ల విలువైన మద్యం, బీర్లు తాగేశారు. ఇది జిల్లాలో సరికొత్త చరిత్ర.



- న్యూ ఇయర్ కిక్కు రూ.10 కోట్లు!
- మద్యం విక్రయాల్లో రికార్డులు బద్దలు
- 11 వేల బాక్సుల మద్యం.. 5500 బాక్సుల బీర్లు ఖాళీ
- అర్ధరాత్రులూ మద్యం సరఫరా చేసిన సర్కారు

చిత్తూరు అర్బన్: ప్రజలకు దాహమేస్తే బిందెడు నీళ్లు ఇస్తున్నారో..? లేదో గానీ.. మద్యం ప్రియులు అడగకున్నా అర్ధరాత్రుల వరకు మద్యాన్ని అందుబాటులో ఉంచిన కూటమి ప్రభుత్వం రూ.కోట్లు కొల్లగొట్టింది. జిల్లా చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో నూతన సంవత్సరం వేళ మద్యం విక్రయాల్లో రికార్డులు బద్దలు కొట్టింది. ఒకటీ, రెండూ కాదు.. ఏకంగా రూ.10 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. దీంతో ప్రభుత్వ ఖజానా నిండింది.

రికార్డు స్థాయిలో విక్రయాలు

జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్లలో ఈ దఫా జరిగిన మద్యం విక్రయాలు గతంలో ఎప్పుడూ జరగనంతగా రికార్డు స్థాయిలో జరిగాయి. జనవరి ఒకటో తేదీ వస్తోందంటేనే మందు బాబులకు పండుగ. ఏది ఉన్నా, లేకున్నా మద్యం మాత్రం ఉండాల్సిందేనంటూ మద్యం ప్రియులు పండుగ చేసుకున్నారు. గత మూడు రోజులుగా జిల్లాలో రూ.10 కోట్ల విలువ చేసే మద్యం తాగేశారు. రోజుకు సగటున జిల్లాలో రూ.40 లక్షల వరకు మద్యం విక్రయాలు జరిగితే.. ఇపుడు ఏకంగా రూ.కోట్లు దాటేసింది. సోమవారం (డిసెంబరు 30)న జిల్లాలోని ఎనిమిది సర్కిళ్లల్లో 6,604 బాక్సుల మద్యం, 3,002 బాక్సుల బీర్లు.. మంగళవారం (డిసెంబరు (31) 4,054 బాక్సుల మద్యం, 1,737 బాక్సుల బీర్లు చిత్తూరులోని మద్యం డిపో నుంచి దుకాణాల నిర్వాహకులు కొనుగోలు చేసి, మద్యం విక్రయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇక జనవరి ఒకటో తేదీన వెయ్యి బాక్సుల వరకు మద్యం, 800 వరకు బీరు బాక్సులు కొనుగోలు చేశారు. ఈ లెక్కన నూతన సంవత్సర నేపథ్యంలో గత మూడు రోజులుగా జిల్లాలో 11,112 బాక్సుల మద్యం, 5,541 బాక్సుల బీర్లను తాగేశారు. గతేడాది ఇదే మూడు రోజుల విక్రయాలు పరిశీలిస్తే మద్యం 8,011 బాక్సులు, బీర్లు 1,878 బాక్సులు అమ్ముడయ్యాయి. గతేడాది ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండడంతో మద్యం అమ్మకాలపై నియంత్రణ ఉండేది. ఇపుడు మొత్తం ప్రైవేటు దుకాణాలు అందుబాటులోకి రావడం, పైగా మందు బాబులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరచి ఉండడంతో ఊహించని వ్యాపారం జరిగింది.

మద్యం మత్తులో కొట్టుకున్నారు!

పుంగనూరు: మద్యం మత్తులో ఒకరినొకరు కొట్టుకోవడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నేతిగుట్లపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని నేతిగుట్లపల్లెకి చెందిన మహేశ్వర్(40), గంగులప్ప పూటుగా మద్యం సేవించారు. ఆ మత్తులో ఘర్షణ పడ్డారు. గొడవ శృతి మించడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో మహేశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆ ప్రాంత వాసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్షకుడి కష్టం.. దళారీ ఇష్టం

దేశానికి వెన్నెముక అయిన రైతు దళారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. చక్కెర కర్మాగారాలు మంచి ధరలు ఇస్తున్నా.. పర్మిట్ల జారీలో కృత్రిమ కొరత సృష్టించి..కర్షకులను దోచుకుంటున్నారు. పుడమిపుత్రుల అవసరాలను ఆసరా చేసుకుని కమీషన్లు నొక్కేస్తున్నారు. ఫలితంగా చెరుకు రైతుల కుదేలవుతున్నారు.



ఫ్యాక్టరీకి తరలించడానికి లారీకి చెరుకు లోడ్ చేస్తున్న కూలీలు


- చేదెక్కిన చెరుకు
- దళారులు నిర్ణయించిందే ధర
- టన్నుకు కమీషన్ రూ.150 నుంచి రూ.200

విజయపురం : సంప్రదాయ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు చెరుకు సాగుపై దృష్టి సారించారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతులు సాగు చేసే చెరుకు క్రషింగ్‌కు సరిపడా కర్మాగారాలు లేకపోవడంతో ఏజెంట్లకు డిమాండ్ పెరిగింది. ఆరుగాలం కష్టపడి పంట సాగు చేసినా.. ధరలు నిర్ణయించేది మాత్రం ఏజెంట్లే. అలా కాదు..కుదరదు అంటే పర్మింట్లు ఇవ్వకుండా అడ్డుపడుతూ రైతులను ఇబ్బంది పెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పోనీ వరి సాగు చేసుకుందామంటే అక్కడ కూడా దళారుల చేతుల్లో మోసం పోతున్నారు. ఇలా రైతులు ఏ పంట సాగు చేసినా అటు దళారులు...ఇటు ఏజెంట్ల చేతుల్లో మోసపోతూ అప్పుల పాలవుతున్నారు.

టన్నుకు మిగిలేది రూ.వెయ్యి

ఉమ్మడి జిల్లా పరిధిలో ఒకటే చక్కెర కర్మాగారం ఉండడంతో పర్మిట్లకు ఎక్కువ డిమాండ్ ఉంది. ఈ క్రమంలో రైతులు తమిళనాడులోని చక్కెర కర్మాగారాలకు చెరుకు తరలించడానికి మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా భావించిన ఏజెంట్లు పర్మిట్లు దొరకడం లేదంటూ టన్నుకు రూ.3 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. చక్కెర కర్మాగారం యాజమాన్యం మాత్రం ఏజెంట్లకు టన్నుకు రూ.3150 ఇస్తోంది. కానీ, ఏజెంట్లు మాత్రం రైతుల అవసరాన్ని ఆసరా తీసుకుని టన్నుకు రూ.150 నుంచి రూ.200 కమీషన్ తీసుకుని, మిగిలిన సొమ్ము అందజేస్తున్నారు. ఇందులో టన్ను చెరుకు కటింగ్ చేయడానికి కూలీలకు దాదాపు రూ.800 చెల్లించాల్సి వస్తోంది. ఇక ఎద్దుల బండిలో చెరుకును పొలంలో నుంచి గట్టుపైకి తరలించడానికి టన్నుకు రూ.200 నుంచి రూ.250, ట్రాక్టర్ అయితే రూ.125 నుంచి రూ.150 వరకు చెల్లించాల్సి వస్తోంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కూలీలు రేటు మరింత పెరుగుతుంది. ఈ ఖర్చులన్నీ పోను రైతుకు రూ.1500 చేతికందుతోంది. అందులోనూ ఎరువులు, పెట్టుబడి ఖర్చులు పోతే టన్నుకు రూ.వెయ్యి మాత్రమే మిగులుతుందని రైతులు వాపోతున్నారు.

అధిక విస్తీర్ణంలో చెరుకు సాగు



నగరి నియోజకవర్గంలో చెరుకు అధిక విస్తీర్ణంలో సాగులో ఉంది. ఒకసారి సాగు చేస్తే మూడు నుంచి నాలుగేళ్ల వరకు ఫలితం అందుతుందన్న ఆశతో చెరుకు సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. అయితే చెరుకు క్రషింగ్‌కు సరిపడా కర్మాగారాలు లేకపోవడంతో ఏజెంట్లకు డిమాండ్ పెరిగింది. ఫ్యాక్టరీలో ఇచ్చే ధరలో రూ.150 నుంచి రూ.200 వరకు కమిషన్ తీసుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ఏజెంట్లు చెప్పిందే వేదం

కొన్ని రోజులు వరి సాగు చేసి గిట్టుబాటు ధర లేకపోవడంతో చెరుకు సాగు చేశాను. అందులోనూ ఆశించిన స్థాయిలో రాబడి లేదు. ఫ్యాక్టరీ యజమాన్యం ఎంత ధర ఇచ్చినా..ఏజెంట్లు చెప్పిందే వేదంగా మారుతోంది. దీంతో మూడేళ్ల ముందే చెరుకు సాగు చేయడం ఆపేశాను. ప్రస్తుతం సజ్జలు, ఉద్దులు, వేరుశనగ పంట సాగు చేస్తున్నాను.

– హరి, కేవీపురం, విజయపురం.

కాణిపాకం భక్తజన సంద్రం

- అంతరాలయ దర్శనం రద్దు
- 60 వేల మందికి పైగా స్వామివారి దర్శనం

కాణిపాకం: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కాణిపాకం భక్తజన సంద్రమైంది. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజామున మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. 4 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి 10 గంటలకు ఈ దర్శనం కొనసాగింది. భక్తులు తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వీఐపీ, శ్రీఘ్ర, అతిశీఘ్ర, ఉచిత దర్శన లైన్లు కిటకిటలాడాయి. సుమారు 60 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులకు నిరంతరం తాగునీరు, పాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈఓ పెంచల కిషోర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు





కాణిపాకంలో భక్తుల రద్దీ(ఇన్‌సెట్) ప్రసాద వితరణ

వినాయకుని సేవలో పలువురు ప్రముఖులు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎస్పీ మణికంఠ చందోలు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, ఆలయ పునః నిర్మాణ దాతలు గుత్తికొండ శ్రీనివాస్, సినీ నటుడు శ్రీనివాసులు రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీకి చిత్రపటం అందజేస్తున్న ఈఓ పెంచల కిషోర్

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యయత్నానికి పాల్పడిన బావాజాన్

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని నక్కబండలో నివాసమున్న బావాజాన్ (34) పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బావాజాన్ రూ.2 లక్షలు ఒక మహిళకు అప్పుగా ఇచ్చాడు. ఆమె తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందుతాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు తక్షణమే అతనిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలరాయుళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో పందేల రాయుళ్లు

చౌడేపల్లె: మండలంలోని మోట్లపల్లె సమీపంలోని కొండ కింద కోడిపందెం ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం పోలీసులకు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఆ సమయంలో కొండకింద కోడిపందెం ఆడుతున్న పెద్దూరుకు చెందిన వెంకటరమణ, గంగిరెడ్డిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3 వేలు నగదు కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



శాంతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కుప్పం రూరల్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మహిళ మృతి చెందిన సంఘటన కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు..కుప్పం మండలం ఎర్రమానుగుంతలు గ్రామానికి చెందిన శాంతి(40) నిత్యం బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ ఉండేది. బుధవారం సైతం బెంగళూరు వెళ్లేందుకు రైలు ఎక్కింది. రైలు కుప్పం స్టేషను వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి, రైలు కిందపడింది. దీంతో శాంతి అక్కడికక్కడికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు శాంతి మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీమకు మణిమకుటం పలమనేరు

పన్ను వసూళ్లలో పలమనేరు మార్కెటింగ్ కమిటీ రాయలసీమకే తలమానికంగా నిలించింది. లక్ష్యంలో 90 శాతం సాధించి, అగ్రస్థానం పొందింది. ఫలితంగా సీమ జిల్లాల్లో గతంలో అత్యధిక ఆదాయం సాధించిన మార్కెట్ కమిటీల పంచన చేరింది. ఇందంతా మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది, కార్యదర్శి నిరంతర శ్రమ, కృషితోనే సాధ్యం అయ్యింది.

- మార్కెటింగ్ వసూళ్లలో పలమనేరు రాయలసీమలో టాప్
- లక్ష్యసాధన కోసం ప్రత్యేకంగా కృషి చేసిన ఏఎంసీ బృందం
- సూపర్‌వైజర్లకు ప్రతివారం దిశానిర్దేశంతోనే లక్ష్యసాధన
- ఫలించిన మార్కెటింగ్ అధికారుల వ్యూహం



పలమనేరు మార్కెట్ కమిటీ కార్యాలయం

పలమనేరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ పన్నుల వసూళ్లలో రాయలసీమలోనే పలమనేరు మార్కెట్ కమిటీ మొదటి స్థానంలో నిలచింది. ఈ ఏఎంసీకి మార్కెటింగ్ శాఖ పన్ను వసూళ్ల లక్ష్యం 2024కి సంబంధించి(వచ్చే ఫిబ్రవరి వరకు) రూ.3 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటికే రూ.2.84 కోట్లు సాధించి(90శాతం) అగ్రస్థానంలో నిలిచింది. ఇందుకు మార్కెటింగ్ శాఖ ముఖ్య అధికారులు, స్థానిక కార్యదర్శి, ప్రత్యేక కృషి, ఎమ్మెల్యే చొరవతో సాధ్యమైంది. ముఖ్యంగా పరిశ్రమలు, ఆహార ఉత్పత్తులు, చెస్ ద్వారా రావాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేయడం ద్వారా వీరు లక్ష్యాలను సాధించారు.

లక్ష్యాలు ఇలా సాధించారు!

జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో రైతులు పండించిన 240 రకాల వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి పన్ను వసూలు చేయాల్సి ఉంది. వీటిల్లోనూ ప్రభుత్వం గతంలో కొన్ని ఉత్పత్తులపై పన్ను మినహాయింపు ప్రకటించింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితిల్లోనూ పలమనేరు అగ్రగామిగా నిలిచేందుకు ఈ ప్రాంతం అటు కర్ణాటక, ఇటు తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడమే కారణమైంది.

రాయలసీమలో పలమనేరుదే అగ్రస్థానం

రాయలసీమలో మొత్తం 84 మార్కెట్ కమిటీలుండగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పది ఏఎంసీలున్నాయి. ఈ ఏడాది పలమనేరు మార్కెటీ కమిటీ రాయలసీమలోనే పన్ను వసూళ్లలో ప్రథమస్థానంలో నిలిచింది. రాయలసీమలో గత పదేళ్ల నుంచి పన్ను వసూళ్లల్లో ఆదోని, కడప, ఎమ్మిగనూరు, తాడిపత్రి, ములకలచెరువు, తిరుచానూరు, శ్రీకాళహస్తి తదితర మున్సిపాలిటీలు అగ్రస్థానంలో ఉండేవి. వేరే ఏఎంసీలకు అప్పులు సైతం ఇచ్చే స్థాయిలో వీటి ఆదాయాలు ఉండేవి. ఇప్పుడు ఆదాయం పరంగా వాటి జాబితాలోకి పలమనేరు కూడా చేరింది.

పన్నుల ఎగవేతపై చర్యలు

గతంలో మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్‌లో పనిచేసే సిబ్బంది కొన్ని వాహనాల నుంచి సెస్ వసూలు చేయకపోవడం, చేతివాటం ప్రదర్శించిన కారణంగా పన్నులు తగ్గేవి. అయితే పలమనేరు మార్కెటింగ్ సిబ్బంది దీనిపై నిఘా పెట్టింది. ఎప్పటికప్పుడు తనిఖీ కేంద్రాలను పరిశీలించి, అక్కడ జరుగుతున్న తప్పులను గుర్తించి చర్యలు తీసుకుంది. దీంతో పాటు నియోజకవర్గంలోని ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీల నుంచి మార్కెట్ కమిటీకి రావాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేశారు.

పన్ను వసూళ్లలో పలమనేరు మేటి



పలమనేరు మార్కెట్ కమిటీ పన్నుల వసూళ్లలో ఈ ఏడాది ముందుంది. దీనికి కారణం అక్కడి అధికారులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిని సారించారు. సూపర్‌వైజర్లు ఆయా ప్రాంతాల్లోని ఆహార పరిశ్రమలు, డెయిరీలు, దాణా పరిశ్రమల పన్నులుపై దృష్టి సారించారు. ముఖ్యంగా రెండు రాష్ట్రాల సరిహద్దుల నుంచి వచ్చే వాహనాలపై సెస్‌లును పటిష్టంగా వసూలు చేశారు. దీంతో వారు మేటిగా నిలిచారు.

– పరమేశ్వరన్, జిల్లా అధికారి, అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్

ప్రణాళిక మేరకు కష్టపడ్డాం



గతంలో మార్కెట్ కమిటీకి సంబంధించి కొన్ని పరిశ్రమల నుంచి పన్నులు వసూలు అయ్యేవికాదు. అయితే మార్కెట్‌కు సంబంధించిన ఆదాయాలపై దృష్టి సారించాం. కార్యాలయంలోని సిబ్బందిని అప్రమత్తం చేసి, వారికి టార్గెట్‌లు పెట్టాం. దీంతో వారు పన్నులను సకాలంలో వసూలు చేశాం. దీంతో పన్నుల వసూళ్లు బాగా జరిగాయి. ప్రతివారం సమీక్షలు పెట్టి పన్నుల వసూలుకు కంకణం కట్టుకున్నారు. దీంతో అనుకున్నదానికంటే ఎక్కువ వసూలు చేయగలిగాం.

– సంజీవకుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి, పలమనేరు

సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల వసూళ్లను పటిష్ఠం చేశారు.

అనాథ అంత్యక్రియలకు
హెల్పింగ్ హ్యాండ్స్

పలమనేరు: అమ్మ జన్మనిస్తే.. నాన్న జీవితాన్ని ఇస్తారు.. చిన్నతనం నుంచి విద్యాబుద్ధులు నేర్పి, మనిషిగా తీర్చిదిద్దుతారు. అలాంటి కన్నవారిని జీవితాంతం గుండెల్లో పెట్టుకుని చూడాల్సిన పిల్లలు వారిని భారంగా భావించి, అనాథలను చేస్తున్నారు. ఆ తల్లిదండ్రులు ఊరుగాని ఊర్లో మృతి చెందితే వారి అంతిమ సంస్కారాలకు సైతం నోచుకోకుంటే మానవతా హృదయంతో తామున్నామంటూ అంత్యక్రియలు చేసిన దయనీయమైన సంఘటన పలమనేరులో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పలమనేరు పట్టణంలోని మార్కెట్ వద్ద ఓ 55 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అతని ఆ చూకీ కోసం గాలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అనాథ శవంగా భావించి, అంత్యక్రియలు చేసేందుకు స్థానిక పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్‌కు సమావారం అందించారు. దీంతో ఆ మిత్ర బృందం ఆ అనాథకు స్థానిక హిందూ శ్మశానవాటికలో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడానికి పలమనేరుకు చెందిన జీలు సాయం చేయగా హెల్పింగ్ హ్యాండ్స్ మిత్రబృందం శివ తదితరులు, పోలీసులు కలిసి అంత్యక్రియలు చేశారు.



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ మిత్ర బృందం

బోయకొండలో విధ్వంసం

- మద్యం మత్తులో కాంట్రాక్టర్ వీర విహారం
- ఈఓ కారు, బైక్‌ను ధ్వంసం
- హడలిపోయిన భక్త జనం
- కేసు నమోదు



ఈఓ కారు అద్దాలను ధ్వంసం చేస్తున్న కాంట్రాక్టర్

చౌడేపల్లె: బోయకొండలో తీర్థం పంపిణీ చేసే కాంట్రాక్టర్ మద్యం సేవించి, ఆ మత్తులో భక్తులతో దురుసుగా ప్రవర్తించడం, అలా చేయొద్దని చెప్పినందుకు ఆలయ సూపరింటెండెంట్‌పై కాంట్రాక్టర్ దురుసుగా ప్రవర్తించి, ఈఓ కారు, సూపరింటెండెంట్ బైక్‌ను ధ్వంసం చేసిన సంఘటనతో భక్తులు హడలిపోయారు. వివరాల్లోకి వెళితే.. నూతన సంవత్సరాది రోజున బోయకొండ గంగమ్మ దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఊహించని రద్దీ నెలకొంది. ఆలయంలోని తీర్థాన్ని భక్తులకు ఒక్కొక్క బాటిల్ రూ.20 చొప్పున విక్రయించడం తెలిసిందే. పుంగనూరుకు చెందిన గౌతమ్ బాటిళ్లలో తీర్థం నీటిని నింపడానికి టెండర్ ద్వారా లీజు హక్కు పొందారు. రద్దీ పెరగడంతో తీర్థం బాటిళ్లకు గిరాకీ ఏర్పడింది. బాటిళ్లలో తీర్థం నింపడంలో ఆలస్యం కావడంతో క్యూలో వేచి ఉన్న భక్తులు ఆలయాధికారులపై మండిపడ్డారు. గమనించిన సూపరింటెండెంట్ రామనాథం తీర్థం నింపే ప్రదేశానికి వెళ్లారు. అక్కడే ఉన్న గౌతమ్‌ను త్వరగా బాటిళ్లను భర్తీ చేసి ఇవ్వాలని భక్తులు ఇబ్బంది పడుతున్నారని చెప్పాడు. దీంతో అప్పటికే మద్యం సేవించిన గౌతమ్ సూపరింటెండెంట్‌తో దురుసుగా మాట్లాడాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వ్యక్తిగత దూషణల పర్వం సాగించడంతో తీర్థం బాటిళ్లు నింపకుండా సిబ్బందిపై తెగబడడంతో గమనించిన భక్తులు హడలిపోయారు. దీంతో భక్తులు తీర్థం బాటిళ్లు కొనుగోలు చేయకుండా వెనుతిరుగుతుండడంతో సమస్య ఈఓ ఏకాంబరం దృష్టికి వెళ్లింది. ఈఓ, సిబ్బంది అక్కడికి చేరుకోగా వారిపై దుర్భాషలాడంతోపాటు.. నీ అంతు చూస్తాం.. నీ కారును ధ్వంసం చేస్తామని ఈఓపై దురుసుగా మాట్లాడడంతో ఆలయం వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో భక్తులు బిక్కుబిక్కుమంటూ వెనుదిరిగారు. అంతటితో ఆగకుండా పార్కింగ్‌లో ఉన్న ఈఓ కారు అద్దాలు, సూపరింటెండెంట్ బైక్‌ను ధ్వంసం చేసి, పెట్రోల్ పోసి తగులపెట్టే ప్రయత్నం చేయబోగా అక్కడే ఉన్న ఆలయ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ ఘటనపై ఈఓ ఏకాంబరం, సూపరిండెంట్ రామనాథం వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ నాగేశ్వరరావును వివరణ కోరగా ఈఓ, సూపరింటెండెంట్ ,ఇద్దరూ వేర్వేరుగా గౌతమ్‌పై ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రాణం తీసిన సరదా



మజీద్(ఫైల్)



మజీద్ మృతదేహం

నగరి: కుశస్థలి నదిలో గల్లంతై ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. నగరిలోని ఇందిరానగర్‌కు చెందిన చాంద్‌బాషా కుమారుడు మజీద్(15) అనే విద్యార్థి పదో తరగతి చదువుతున్నాడు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అతడు తన మిత్రులు అబ్దుల్, ఇర్ఫాన్, ఇజ్యాన్‌తో కలిసి రాంనగర్‌కు సమీపంలో ఉన్న కుశస్థలి నది పరివాహక ప్రాంతంలో సరదాగా గడపడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు మజీద్ కాలు జారి కుశస్థలి నదిలో పడిపోయాడు. మిత్రులు ముగ్గురు కాపాడడానికి ప్రయత్నించినప్పటికీ మునిగిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి, విద్యార్థి మృతదేహాన్ని బయటకు తీశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం



రాజన్న(ఫైల్)

చౌడేపల్లె: బోయకొండ –మదనపల్లె మార్గంలోని పక్షి రాజపురం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. దిగువపల్లె పంచాయతీ అప్పినేపల్లెకు చెందిన రాజన్న(42) భవన కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పక్షిరాజపురానికి నడచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం తో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజ వాహనంపై సిరులతల్లి



ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతీదేవి గజవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవ చేశారు. అనంతరం సిరులతల్లిని గజవాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.

ఆగమశాస్త్రంతోనే ఆనందం

తిరుపతి సిటీ:సర్వ మానవాళికి అభ్యున్నతికి దోహద పడి, ఆనందాన్ని సమకూర్చేది ఆగమ శాస్త్రమని ఆచార్య తట్టా విజయరాఘవాచార్యులు తెలిపారు. బుధవారం జాతీయ సంస్కృత వర్సిటీలో ఏడు రోజులపాటు ఆన్‌లైన్‌లో నిర్వహించిన పాంచరాత్ర ఆగమ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జాతీయ సదస్సు ద్వారా ఆగమశాస్త్రంలోని ఎన్నో విషయాలను పండితులు తెలియజేయడం అభినందనీయమన్నారు. డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ పీటీజీ భరతశేఖరాచార్యులు, వేదాంతం విష్ణుభట్టాచార్యులు, రంగరామానుజాచార్యులు పాల్గొన్నారు.

తెల్లనీళ్లపల్లెలో చిరుత సంచారం

చౌడేపల్లె: మండలంలోని తెల్లనీళ్లపల్లె పరిసరాల్లో బుధవారం రాత్రి చిరుత పులి సంచరించినట్లు గ్రామస్తులు గుర్తించారు. గ్రామ సమీపంలోని పొలాల్లో చిరుత పులిని చూసిన ప్రజలు కేకలు వేయడంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. చిరుత పులి సమాచారం తెలిసిన గ్రామస్తులు హడలిపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బైరెడ్డిపల్లె: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పరుశురాముడు పేర్కొన్నారు. గంగవరం మండలం దండపల్లె సమీపంలోని జోగిండ్లు గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం ద్విచక్రవాహనంలో కర్ణాటక నుంచి సుమారు రూ.20 వేలు విలువ చేసే మద్యం తీసుకువస్తుండగా తీర్థం క్రాస్ వద్ద నిఘా పెట్టి, అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టెండర్ సరే..
డిపాజిట్ ఏదీ..?

కాణిపాకం: కాణిపాకంలోని పలు టెండర్ డిపాజిట్‌లో జాప్యం చోటుచేసుకుంటోంది. అధికారం అండతో పలువురు టెండర్‌దారులు డిపాజిట్ నగదు చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఐదుగురు రూ. కోటి వరకు డిపాజిట్ చెల్లించాల్సి ఉంది. దీనిపై ఉభయదారులు, భక్తులు, ఓ వర్గం కూటమినేతలు మండిపడుతున్నారు. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని పలు షాపులు, ఆలయ పరిసర ప్రాంతాల్లో పలు పనుల నిర్వహణకు సంబంధించి పలుసార్లు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లను కూటమి నేతలకే దక్కేలా విశ్వ ప్రయత్నాలు జరిగాయి. టెండర్లే వేయకుండా కుట్రలు పన్నారు. ఈ ప్రయత్నంలో టెండర్ల ప్రక్రియ పలుసార్లు వాయిదా పడుతూ వచ్చింది. టెండర్ల వ్యవహారంపై పలు వార్తా పత్రికల్లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు గతనెల టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. టెండర్లు పాడుకున్న వ్యక్తులు ఒప్పందం మేరకు డిపాజిట్ చెల్లించాల్సి ఉంది. ఆ తర్వాతే లైసెన్స్‌లు అప్పగిస్తారు. అయితే కొందరు (ఐదుగురు) కూటమి సర్కారును అడ్డం పెట్టుకుని.. డిపాజిట్ నగదు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారు. అయినా లెసెన్స్‌లు మాత్రం జారీ చేశారు. ఈ నేపథ్యంలో డబ్బులు చెల్లించకుండా ఎలా లైసెన్స్‌లు జారీ చేస్తారని ఉభయదారులు, భక్తులు, కూటమి నేతలు పలువురు మండిపడుతున్నారు. ఐదుగురికి గాను రూ. కోటి వరకు డిపాజిట్ బకాయిలు ఎలా పెడుతారని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దీనిపై కూటమిలోని ఓ వర్గం దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేయనుంది. కాగా అధికారులు వారికి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

వరసిద్ధుడి లోగిలి..
మంచు కౌగిలి!



మంచు కమ్ముకున్న వరసిద్ధి క్షేత్రం

వరసిద్ధి వినాయక క్షేత్రాన్ని మంచు కమ్మేసింది. సాయంత్రం ఆరు గంటలకే పొగ మంచుతో ఉదకమండలాన్ని తలిపించింది. ఎదుటి మనిషి, విద్యుత్ దీపాలు సైతం కనిపించనంతగా మంచు తెరలు కప్పేయడంతోపాటు చలి తీవ్రత పెరగడంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. అయినా క్యూలలో వేచి ఉండి, స్వామివారిని దర్శించుకున్నారు.

– కాణిపాకం